సాక్షి
జగిత్యాల

సోమవారం ၊ 24 ၊ ఏప్రిల్ ၊ 2023



నేడు ప్రజాచైతన్య యాత్ర

కథలాపూర్ : సోమవారం చేపట్టే ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నేత సుతారి రాములు కోరారు.



నృసింహుని సన్నిధిలో కలెక్టర్


బుగ్గారం : కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కుటుంబ సమేతంగా ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
36.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్లు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.





ఈ యువకుడి పేరు నాగరాజు. గోల్డ్‌స్మిత్. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటాడు. నాగరాజుకు ఇద్దరు అక్కలు. గతంలో తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇంటిబాధ్యతలు తనపై వేసుకున్నాడు. పీజీ పూర్తిచేసినా.. వేరే ఉద్యోగం వైపు చూడకుండా కులవృత్తిపైనే ఆధారపడ్డాడు. బంగారు ఆభరణాల తయారీపై గోదావరిఖనిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. తరువాత కరీంనగర్‌లో పనిచేశాడు. ఇద్దరు అక్కల వివాహాలు చేశాడు. ప్రస్తుతం ఇంటివద్దే దుకాణం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కులవృత్తి అన్నం పెడుతోందని, అందుకే వేరే ఆలోచన చేయలేదని నాగరాజు చెబుతున్నాడు.

పోటీ ఉంది..

నేను బీకాం పూర్తిచేశాను. 12 ఏళ్లుగా మా కులవృత్తిలోనే కొనసాగుతున్నా. కొత్త ఇండ్లకు అవసరమైన మెటీరియల్, మంచాలు, సోఫాలు, తదితర ఫర్నీచర్ తయారు చేస్తుంటాను. మా కులవృత్తిలోనూ పోటీ ఉంది. బిల్డర్లు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు మెటీరియల్ తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం కూడా మాకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తే బాగుంటుంది. – నూతి సంతోష్‌కుమార్, అమర్‌నగర్, పెద్దపల్లి

కులవృత్తుల్లో ఈతరం

కనుమరుగవుతున్న కళకు జీవం

- ఆధునికత జోడిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..
- కుటుంబానికి అండగా.. ఉపాధితో ఆనందంగా..
- కులవృత్తిలో అధిక సంఖ్యలో నాయీబ్రాహ్మణులు..
- అతితక్కువగా శాలివాహనులు

అంతరించిపోతున్న కళలకు వారుజీవం పోస్తున్నారు. నాటి తరం బాధ్యతను భుజాన వేసుకుని ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా.. కార్పొరేట్ ఉద్యోగాలబాట పట్టకుండా.. పుట్టిన ఊరిలో నమ్ముకున్న కులవృత్తి చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. తాతలు, తండ్రులు నేర్పిన పనే ఇప్పుడు కుటుంబానికి ఆసరా అవుతోందని చెబుతున్నారు. తాము చేసే పనికి మరింత ఆధునికత జోడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తిలో మరింత నైపుణ్యం సాధిస్తూ వచ్చిన ఆదాయంతో ఆనందంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న యువతలో ఎక్కువగా నాయీబ్రాహ్మణులు ఉండగా.. అతితక్కువ శాలివాహనులు ఉన్నట్లు సమాచారం. కనుమరుగు అవుతున్న కులవృత్తులకు జీవం పోస్తున్న యువ'తరం'పై ప్రత్యేక కథనం.. - సాక్షి, కరీంనగర్ డెస్క్



ఈ యువకుడు ఎనగందుల రాజు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన రాజు డిగ్రీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో మంచి ఉద్యోగ అవకాశం వచ్చింది. అయినా వెళ్లలేదు. గ్రామంలోనే తండ్రి, సోదరుడితో కలిసి సెలూన్ ఏర్పాటు చేసుకున్నాడు. నిత్యం ముగ్గురు కలిసి పనిచేస్తున్నారు. ఖర్చులు పోను రోజూ రూ.500 మిగులుతాయని రాజు చెబుతున్నాడు. తనకు కులవృత్తి చేయడం అంటే ఇష్టమని, అందుకే వేరే ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లలేదని అంటున్నాడు. అయితే.. పట్టణాల్లో వెలుస్తున్న కార్పొరేట్ సంస్థలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చిరువృత్తికారులకు అండగా ఉండి, కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇవ్వొద్దని రాజు కోరుతున్నాడు.



ఈయన తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్. సొంతూరు మానకొండూర్ మండలం వెల్ది. కుటుంబ పరిస్థితులు పెద్ద చదువులకు అడ్డంకిగా మారాయి. దీంతో వ్యవసాయం, కులవృత్తే ఇతనికి ఆధారం అయ్యింది. ఉన్న భూమిని సాగు చేసుకుంటూ.. పొద్దున, సాయంత్రం తాటిచెట్లు ఎక్కుతూ కల్లుగీస్తుంటాడు. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇక్కడ విశేషం ఏంటంటే.. ఈ గ్రామంలో ఈయన తరంలో కల్లుగీత కార్మికుల్లో ఇతను ఒక్కడే ప్రస్తుతం పనిచేస్తున్నాడు. మిగితా వారందరూ ప్రత్యామ్నాయం చూసుకున్నారు. 'మేము నలుగురం అన్నదమ్ములం. కులవృత్తి చేయడంలో ఆనందం ఉంది. ఒక్కడినే ఊళ్లో ఉంటున్నా. అందరూ ప్రత్యామ్నాయం వెతుక్కున్నారు. ప్రభుత్వం మాకు అండగా ఉండాలి' అని మహేందర్ కోరుతున్నాడు.

ఆధునికతను జోడిస్తూ..

ప్రస్తుతకాలంలో కులవృత్తి చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. డిగ్రీపూర్తికాగానే ప్రయివేటు ఉద్యోగమో.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపరేషనో చేస్తున్నారు. ఇలా గత రెండు, మూడు దశాబ్దాల నుంచే కులవృత్తులు అంతరించిపోవడం కనిపిస్తోంది. అందివచ్చిన మిషనరీ చాలా కులవృత్తులను చావుదెబ్బ కొట్టగా... గ్రామాల్లోని యువతకు చేతిలో పనిలేకుండా పోయింది. కార్పొరేట్ కంపెనీలు.. రెడీమేడ్ వస్తువులు చేతివృత్తులపై ప్రభావం చూపాయి. చాలా మంది పనుల నిమిత్తం వలస వెళ్లిన సందర్భాలు అనేకం. అయితే ప్రస్తుత యువత ప్రజల అభిరుచికి అనుగుణంగా వారి కులవృత్తిలో ఆధునికత జోడిస్తూ ముందుకు సాగుతోంది. రెడీమేడ్, పట్టణాల్లో ఉండే సదుపాయాలను గ్రామాల్లోనూ కల్పిస్తూ కులవృత్తులకు జీవం పోస్తున్నారు.

ట్రెండ్ సెట్ చేస్తూ..

ప్రస్తుత యువత కులవృత్తిలో నయా ట్రెండ్ సెట్ చేస్తోంది. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా నడుచుకుంటోంది. నాయీబ్రాహ్మణులు పల్లెల్లో, పట్టణాల్లోనూ ఉండే విధంగా సెలూన్లు తీర్చిదిద్దుతున్నారు. కొత్తకొత్త హెయిర్‌స్టైల్‌తో ఆకట్టుకుంటున్నారు. గోల్డ్‌స్మిత్‌లు పెద్దపెద్ద బంగారు దుకాణాల్లో దొరికే వాటికన్నా సరికొత్త డిజైన్లు తయారు చేస్తున్నారు. వివిధ వెబ్‌సైట్లలో సెర్చ్‌చేస్తూ అందమైన పసిడి ఆభరణాలు తయారు చేస్తున్నారు. కార్పెంటర్లు కూడా కంప్యూటరైజ్డ్ డిజైన్లు తయారు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటూ.. కంటికి ఇంపైన ఇంటీరియల్ తయారు చేస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. అదేవిధంగా వివిధ కులవృత్తుల యువత ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ చేతివృత్తులకు సరికొత్త నిర్వచనం ఇస్తోంది.

వీరు ఎక్కువ...

ఉమ్మడి జిల్లా పరిధిలో నాయీబ్రాహ్మణుల్లో ఎక్కువగా యువత కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 10వేలకు మందికి పైగా యువత పట్టణాలు, గ్రామాల్లో సెలూన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నిత్యం రూ.500నుంచి రూ.1000 వరకు సంపాదిస్తామని పలువురు చెబుతున్నారు. తరువాత రజకులు 5వేల మంది వరకు కలవృత్తిపై ఆధారపడ్డారు. అయితే వీరికి గ్రామాల్లో తక్కువగా ఉపాధి ఉండగా.. పట్టణాలకు వలస వెళ్తున్నారు. కరీంనగర్‌లో అత్యధిక మంది యువత లాండ్రీపై ఆధారపడి బతుకుతున్నారు. విశ్వబ్రాహ్మణుల్లోనూ చాలామంది సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 4వేలకు పైగా మంది గోల్డ్‌స్మిత్, కార్పెంటర్, ఫర్నీచర్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. గౌడకులస్తుల్లో యువత కల్లుగీయడానికి ముందుకు రావడం లేదు. ఒక్కోగ్రామంలో ఒకరిద్దరు మాత్రమే కల్లుగీసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3వేల మంది వరకు యువత కల్లుగీతపై ఆధారపడి బతుకుతోంది. సిరిసిల్లలో బట్టల తయారీలో యువతరం తమ ప్రతిభ చాటుతోంది. మత్స్యకారుల కుటుంబాల్లోనూ యువత చేపలు పడుతూ ఉపాధి పొందుతోంది. ఎల్ఎండీ, మిడ్‌మానేరు, ఎగువమానేరు, కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉపాధి పెరిగిందని చెబుతున్నారు. ఇక మేరు, శాలివాహనులు, తదితర కులస్తులు తమ వృత్తిలో ఉపాధి లేకపోవడంతో ప్రత్యామ్నాయ బాటపడుతున్నారు. ప్రతీ కులస్తులు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నారు. తమ వృత్తికి సంబంధించి సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతున్నారు. సర్కారు ప్రోత్సాహం ఉంటే తాము మరింత ఉత్సాహంగా పనిచేస్తామని, తమ వృత్తులను బతికించుకుంటామని చెబుతున్నారు.

అమ్మానాన్నకు తోడుగా..




మాది కరీంనగర్. నాన్న చిరుద్యోగి. అమ్మ కులవృత్తే చేస్తుంది. నేను డిగ్రీ పూర్తిచేశాను. ప్రస్తుతం ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నా. ఇంట్లోనే లాండ్రీ షాపు నడిపిస్తాం. నాన్న డ్యూటీకి వెళ్లినప్పుడు నేనూ ఇస్త్రీ చేస్తుంటాను. పొద్దంతా ఉద్యోగానికి వెళ్లివచ్చి సాయంత్రం కులవృత్తి నిర్వహిస్తుంటా. మా పని మేము చేసుకోవడంలో ఆనందమే వేరు. ప్రభుత్వం ఇంట్లోని లాండ్రీలకు కూడా విద్యుత్‌లో రాయితీ ఇవ్వాలి. – నరేశ్, హనుమాన్‌నగర్, కరీంనగర్

15ఏళ్లుగా ఇదే పని..



మాది సిరిసిల్లలోని సుందరయ్యనగర్. నేను పెద్దగా చదువుకోలేదు. నాకు 17ఏళ్ల వయసున్నప్పుడు నుంచి మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాను. దాదాపు 15ఏళ్లకు పైగా ఇదే వృతిలో కొనసాగుతున్నాను. వారానికి రూ.2000–రూ.2500 వరకు సంపాదిస్తాను. నాకు ఇద్దరు పిల్లలు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకే సరిపోతోంది. – పిక్కల శేఖర్, సిరిసిల్ల

ప్రభుత్వం దయచూపాలి



నేను 16ఏళ్ల నుంచి పెద్దపల్లిలో దర్జీగా పనిచేస్తున్నా. మా నాన్న నుంచి ఈ పని నేర్చుకున్నాను. ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాలతో గిరాకీ బాగా తగ్గిపోయింది. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతోంది. ఇక ఈ వృత్తిలోకి మా పిల్లలను రానివ్వను. ప్రభుత్వం మాపై దయచూపాలి. స్కూల్ యూనిఫారమ్‌లు కుట్టేబాధ్యత మాకే ఇవ్వాలి. ఇతర కులస్తులకు రాయితీపై బట్టలు కుట్టే మిషనరీలు ఇస్తున్నారు. అవి మాకూ ఇస్తే బాగుంటుంది. రెడీమేడ్‌పై ట్యాక్ విధించాలి. – మంథని నర్సింగ్, పెద్దపల్లి

40వేల ఎకరాల్లో నష్టం

- దెబ్బతిన్న మామిడి.. నువ్వుదీ అదే పరిస్థితి
- పంటలు నష్టపోయి తల్లడిల్లుతున్న అన్నదాతలు
- ప్రాథమిక అంచనాలు రూపొందించిన అధికారులు



కథలాపూర్ మండలం భూషణరావుపేటలో రాలిన మామిడికాయలు ఏరుతున్న రైతులు



కోరుట్ల మండలంలో నేలవాలిన నువ్వు పంట

కథలాపూర్(వేములవాడ): అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచాయి. గురువారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులు, శనివారం కురిసిన వడగళ్ల వానలు రైతులకు కడగళ్లు మిగిల్చాయి. వానదేవుడు ఆదివారం కూడా కర్షకులను వెంటాడాడు. చేతికి వచ్చిన మామిడి, నువ్వు, వరి, మొక్కజొన్న పంటల్ని తీవ్రంగా నష్టపర్చాడు. గత రెండ్రోజుల్లో కురిసిన వర్షాలకు జిల్లావ్యాప్తంగా సుమారు 40వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆదివారం మరోసారి కురిసిన వర్షం కోలుకోలేని దెబ్బతీసింది.

కంటిమీద కునుకులేదు..

- జిల్లాలోని 20 మండలాల్లో మూడురోజులుగా వడగళ్లు, ఈదురుగాలులు అన్నదాత కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.
- పొద్దంతా పంటలను కాపాడుకునేందుకు నిరీక్షించి రాత్రివేళల్లో ఇంటికి చేరగానే.. వడగళ్లు, ఈదురుగాలులు రైతులను పొలాల వద్దకు పరుగెత్తిస్తున్నాయి.
- గురువారం రాత్రి, శనివారం కురిసిన వర్షంతో జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం జరిగినట్లు ఉద్యానవనశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- మరోవైపు 6,500 ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులకు నివేదికలు తయారు చేశారు.
- మరో 3,500 ఎకరాల్లో ఇతర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.
- వీటిపై ప్రాథమిక నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు అందజేశారు.
- అయితే, నువ్వు పంటకు నష్టం జరిగినా అధికారులు అంచనా వేయలేదని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.
- మరోవైపు.. నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాథమిక అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేశ్ తెలిపారు.



మేడిపెల్లి : తడిసిన ధాన్యం చూపుతున్న రైతు

విరిగిన చెట్టు.. ఆగిన రాకపోకలు

మేడిపెల్లి(వేములవాడ): ఆదివారం కురిసిన ఈదురుగాలులు, భారీవర్షంతో నిజామాబాద్ – జగిత్యాల జాతీయ రహదారిపై చెట్టు విరిగిపడింది. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు.. స్థానికుల సాయంతో రెండు జేసీబీలు తెప్పించి చెట్టును తొలగించారు. ఆ తర్వాత రాకపోకలు పునరుద్ధరించారు.

తడిసి ముద్దయిన ధాన్యం

భీమారం, మేడిపెల్లి మండలాల్లో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు తేరుకునేలోపే ధాన్యం తడిసిపోయింది.

తప్పిన ప్రమాదం

సారంగాపూర్(జగిత్యాల): ఈదుగాలులు, భారీవర్షానికి వడ్డెరకాలనీ – నాగునూర్ మధ్య ప్రధాన రహదారిపై భారీచెట్టు విరిగిపడింది. దీంతో జగిత్యాల – రంగపేట, నాగునూర్–వడ్డెరకాలనీ మధ్య రాకపోకలు స్తంభించాయి. స్థానికులు దానిని తొలగించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. కాగా, రెండు మండలాల్లో ఆదివారం సాయంత్రం కూడా భారీవర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. కొల్వాయి గ్రామంలో వడగళ్లవర్షం కురిసింది.



నిజామాబాద్ - జగిత్యాల మధ్య విరిగిపడ్డ చెట్టు

మళ్లీ వర్షం

కథలాపూర్(వేములవాడ): వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. దూలూర్, భూషణరావుపేట, కథలాపూర్, సిరికొండ, దుంపేట గ్రామాల్లో పంటల నష్టం తీవ్రత అధికంగా ఉంది. ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లు ఈదురుగాలుల ధాటికి కొట్టుకుపోయాయి. కుప్పల్లో చేరిన వర్షపునీటిని తోడేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడ్డారు.



దూలూర్‌లో కురిసిన వడగళ్లు

రెండెకరాల్లో నష్టం



సాగుకు నీటి అవసరం తక్కువని రెండెకరాల్లో నువ్వు పంట ఏసిన. మూడు నెలలు పంటను కాపాడుకున్న. ఈదురుగాలులు, వర్షంతో నువ్వు కర్రలు విరిగి నేల వాలినయి. మంచిధర ఉండటంతో లాభం వస్తుందనుకుంటే.. వర్షం కురిసి నష్టం చేసింది. రూ.60 వేల వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – ముత్యంరెడ్డి, రైతు, ఇబ్రహీంపట్నం

రూ.లక్ష నష్టం



నాకు ఐదు ఎకరాల్లో మామిడి తోట ఉంది. కాయలు మంచిగ కాసినయి. మార్కెట్‌కు తరలించే ఏర్పాట్లలో ఉన్నం. ఈదురుగాలులతో కాయలు నేలరాలినయి. మామిడికాయలు రాలి పగిలినయి. రూ.లక్షకుపైగా నష్టం వచ్చింది. ప్రభుత్వం, అధికారులు ఆర్థిక సాయం అందజేయాలి. – బాపు మురళీగౌడ్, రైతు, కథలాపూర్

- చౌలమద్దిలో మినీ ఫంక్షన్‌హాల్ విషయంలో వివాదం
- వీడీసీ ఆదేశాలను పట్టించుకోని గీత కార్మికులు
- అగ్రహంతో కల్లు కొనుగోలు చేయవద్దని వీడీసీ అంక్షలు
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు గౌడ సంఘం నాయకుల ఫిర్యాదు

ఆగని ఆగడాలు!

సాక్షి



చౌలమద్దిలోని ఈతవనం వద్ద గీత కార్మికులు

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ల ఆగడాలకు అడ్డుకట్ట పడడంలేదు. పోలీసులు కేసులు నమోదు చేసినా లైట్ తీసుకుంటున్న కొందరు వీడీసీ సభ్యులు.. పల్లెల్లో తమమాట వినని వారిపై జులుం ప్రదర్శిస్తూనే ఉన్నారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్, వెల్లుల్ల, కొండ్రికర్లల్లో కొందరు వీడీసీ సభ్యులు ఇటీవల అనాగరిక చర్యలకు పాల్పడ్డారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులులైన కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేశారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అయినా, వారి పద్ధతి మార్చుకోవడంలేదు. తాజాగా చౌలమద్ది గ్రామంలో గీత కార్మికులపై ఆంక్షలు విధించి మానసికంగా వేధిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తమ ఆదేశాలు పట్టించుకోవడం లేదనే కారణంతో గౌడకులస్తుల నుంచి గ్రామస్తులు కల్లు కొనుగోలు చేయవద్దని అంక్షలు విధించారు. దీనిపై వారంరోజుల క్రితం సంఘం నాయకులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. వివాదాన్ని పరిష్కరించాలని స్థానిక ఎక్సైజ్ అధికారులను మంత్రి ఆదేశించారు. కానీ ఇంతవరకూ ఆ సమస్య పరిష్కరించలేదని గీతకార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివాదానికి కారణమిదే..

- చౌలమద్ది గ్రామానికి చెందిన ఓ స్థలంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మినీ ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. దీనికి ఎంపీ ఫండ్స్ నుంచి మంజూరైన నిధులతోపాటు సంఘానికి సంబంధించిన మరికొన్ని నిధులు వెచ్చించారు.
- కేవలం గీతకార్మికులే కాకుండా గ్రామానికి చెందిన అందరూ తమ అవసరాలకు దీనిని వినియోగించుకోవచ్చని నిర్ణయించారు.
- అయితే, ఆదినుంచీ ప్రధాన గేటుకు తాళం వేయడం లేదు. ఈ నేపథ్యంలో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంఘం నాయకులు దీనిని గుర్తించి కొన్నిరోజుల క్రితం నుంచి తాళం వేస్తూ వస్తున్నారు.
- వీడీసీ సభ్యులు దీనిని వ్యతిరేకించారు. తాళం తీసి ఉంచాలని గీతకార్మికులను ఆదేశించారు.
- ఈఆదేశాలను గౌడ కులస్తులు పట్టించుకోలేదు. దీంతో అగ్రహం చెందిన వీడీసీ సభ్యులు.. గ్రామస్తులెవరూ గీతకార్మికుల నుంచి కల్లు కొనుగోలు చేయవద్దని పదిహేను రోజుల క్రితం ఆంక్షలు విధించారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి వివాదం

కల్లు విక్రయాలపై ఆంక్షలు విధించడాన్ని తీవ్రంగా పరిగణించిన గౌడసంఘం జిల్లా కార్యదర్శి చెట్లపల్లి సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో వారంరోజుల క్రితం విషయాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన మంత్రి.. వివాదాన్ని పరిష్కరించాలని స్థానిక ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. రెండు రోజులక్రితం అధికారులు గ్రామానికి వెళ్లి గౌడ కులస్తులు, ప్రజాప్రతినిధులు తదితరులతో సమావేశమయ్యారు. సమావేశానికి వీడీసీ సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో వివాదం పరిష్కరించకుండానే అధికారులు వెనుదిరిగారు.

ఆంక్షలతో ఇబ్బందులు..

- గ్రామానికి చెందిన 40 కుటుంబాలు గీత వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.
- ప్రతీరోజు వీరి వద్దకు గ్రామానికి చెందిన వారే కాకుండా ఇతర గ్రామాలకు చెందిన కస్టమర్లు కూడా కల్లు కోసం వస్తుంటారు.
- అయితే ఎక్కువగా గ్రామానికి చెందిన వారే కల్లు కొనుగోలు చేస్తారు.
- ప్రస్తుతం వీరంతా కల్లుకు దూరంగా ఉండడంతో విక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోందని కార్మికులు వాపోతున్నారు.

ఆంక్షలు సరికాదు



ఫంక్షన్‌హాల్ వివాదంలో కల్లుపై ఆంక్షలు పెట్టడం సరికాదు. ఫక్షన్‌హాల్‌కు తాళం వేసినా.. ఎవరికి అవసరం ఉన్నా ఇస్తామని చెప్పాం. అయినా వినిపించుకోకుండా కల్లు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు పెట్టడం బాధాకరం. అధికారులు జోక్యం చేసుకొని వివాదాన్ని పరిష్కరించాలి. – గంగాధర్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు

వృత్తిపైనే ఆధారపడి ఉన్నాం



గ్రామంలో చాలాకుటుంబాలు గీత వృతిపైనే ఆధారపడి ఉన్నాయి. కల్లు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు పెడితే వృత్తి దెబ్బతింటుంది. పక్షంరోజులుగా మా వద్ద గ్రామస్తులు కల్లు కొనుగోలు చేయడం లేదు. దీనివల్ల ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు జోక్యం చేసుకోవాలి. – రాజేశ్వర్‌గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

మామిడి రైతులకు అండగా ఉంటాం



మామిడికాయలను పరిశీలిస్తున్న మంత్రి ఈశ్వర్

జగిత్యాల అగ్రికల్చర్ : మామిడి రైతులకు అండగా ఉంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి అకాలవర్షానికి దెబ్బతిన్న మామిడి, నువ్వు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.. అధికారులతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డితో మాట్లాడానని, పంటనష్టం నివేదికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు సత్తిరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేడిపెల్లి : మండలకేంద్రంలోని కట్లకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 సంవత్సరంలో చదువుకున్న (పదో తరగతి బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను వారు నెమరువేసున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఈటల దిష్టిబొమ్మ దహనం

ముస్తాబాద్: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు మండలకేంద్రంలో ఆదివారం దహనం చేశారు. యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాళ్ల విజయ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణం



- జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి జియోమార్ట్‌కు వెళ్లే రహదారిలో సెట్‌బ్యాక్ కోసం విడిచిపెట్టి అనంతరం మళ్లీ మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారుతోంది. ఇలా నిర్మాణాలు కోకొల్లలుగా జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇల్లు జగిత్యాలలోని బృందావనం కాలనీలోనిది. 30 ఫీట్ల రోడ్డు ఉంటేనే నిర్మాణానికి అనుమతిస్తారు. 15 ఫీట్ల రోడ్డు ఉండగా 7.5 ఫీట్లు ఇటువైపు, 7.5 ఫీట్లు అటువైపు వదలి నిర్మించుకోవాల్సి ఉంటుంది. కాలనీలో అలాంటిదేమీ పట్టించుకోకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. కొందరు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అధికారులు నిర్మాణం ఆపివేయాలని సూచించినా మళ్లీ నిర్మాణం చేపడుతున్నారు.

- సెట్‌బ్యాక్ పట్టించుకోని వైనం?
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- ప్లాన్‌లో ఒకటి... కట్టేది ఒకటి
- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

జగిత్యాల: మున్సిపల్‌లో అక్రమ నిర్మాణాలతో పాటు కాకుండా సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయి.లేఅవుట్ లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఇప్పటికే జిల్లాలో ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నూతన చట్టం ప్రకారం 30 ఫీట్ల రోడ్డు ఉంటేనే అనుమతివ్వాలి. కొందరు 30 ఫీట్ల రోడ్డు లేకుండానే నిర్మిస్తున్నారు. ప్రజావాణిలో దరఖాస్తులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారదర్శకత కోసం ప్రభుత్వం టీఎస్‌బీపాస్ పథకం తీసుకొచ్చింది. దీంతో ఇంటి నుంచే అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంజినీర్ ప్లాన్‌తో అన్ని డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకుంటే టౌన్‌ప్లానింగ్ వారు అనుమతిస్తారు. కాగా వీరితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఉంటుంది. వీరు అక్రమంగా నిర్మిస్తున్నా, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్నా చర్యలు తీసుకోవచ్చు. గతంలో ఎన్నో అక్రమ నిర్మాణాలు కూల్చివేసినా కొందరు కళ్లుగప్పి మళ్లీ సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు.

ప్లాన్ ఒకటి.. నిర్మాణం మరొకటి...

సరైన ప్లాన్ చూపకున్నా, ఇంటి నిర్మాణంలో సెట్‌బ్యాక్ లేకున్నా రోడ్డుకు ల్యాండ్ విడిచిపెట్టకున్నా అనుమతి రాదు. కొందరు ఇంజినీర్‌తో రోడ్డుకు, సెట్‌బ్యాక్‌కు తీస్తున్నట్లు సంబంధిత మ్యాప్ రూపొందించుకుని అనుమతి కోసం దరఖాస్తు చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు 21 రోజుల్లో అనుమతి ఇస్తున్నారు. మళ్లీ ప్లాన్ చేంజ్ చేయడం లేదా సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్ కోసం విడిచిపెట్టిన స్థలాల్లో లిఫ్టులు, మెట్లు, టాయిలెట్స్‌కు సంబంధించిన నిర్మాణాలు చేపడుతున్నారు.

తనిఖీలెక్కడ?

టాస్క్‌ఫోర్స్ బృందాలు కాకుండా మున్సిపల్ కమిషనర్లకు బాధ్యతలు అప్పగిస్తూ గతంలో ఉత్తర్వులు సైతం జారీఅయ్యాయి. వీరు 15 రోజులకోసారి ప్రతి వార్డును పర్యటించి అక్రమ నిర్మాణాలు జరిగితే సుమోటోగా స్వీకరించాలి. సంబంధిత ఇంటి యజమానికి నోటీసు జారీచేసి అనంతరం కూల్చివేయాల్సి ఉంటుంది. గతంలో ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసే అధికారం టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఉండేది. ప్రస్తుత కమిషనర్ పర్యటించి ఎక్కడ నిర్మాణం జరుగుతున్నా వాటిని పరిశీలించి అనుమతి లేని నిర్మాణాలను సుమోటోగా కేసు స్వీకరించి నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

తనిఖీలకు కమిటీ

మున్సిపాలిటీల్లో టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటితో పాటు అనుమతులు లేకుండా విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపై వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా ర్యాండమ్‌గా తనిఖీలు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ బందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, అగ్నిమపక శాఖ అధికారులు ఉంటారు. ఎక్కడైనా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు లేకుండానే కూల్చివేసే అధికారం వారికి ఉండేది. ఇప్పుడు యథాయథంగా కమిటీ ఉన్నప్పటికీ నేరుగా కూల్చివేసే అధికారం మాత్రం లేదు. గతంలో వీరు కూల్చివేయడంతో కొందరు కోర్టుకు వెళ్లగా కమిషనర్లకు బాధ్యతలు అప్పగించాలని సూచించింది.

పారదర్శకంగా చేపడతారా..?

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల సన్నిహితులు, సంబంధించిన వ్యక్తులు పెద్ద ఎత్తున అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. పారదర్శకంగా చేపడితే ఇందులో ఎన్నో అక్రమ కట్టడాలు వెలికి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో మున్సిపాలిటీల్లో పెద్దపెద్ద భవనాలు అక్రమంగా నిర్మించినవే అధికంగా ఉన్నాయి. కొందరు ప్రజాప్రతినిధుల అండతో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తాం. మున్సిపల్‌లో పర్యటించి సెట్‌బ్యాక్ లేకుండా, ప్లాన్‌లో ఒకతీరు, కట్టేది మరోలా ఉంటే చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు. – నరేశ్, మున్సిపల్ కమిషనర్

రైతులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

కోరుట్లరూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్రప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అభయం ఇచ్చారు. పైడిమడుగు, జోగిన్‌పెల్లి గ్రామాల్లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. నువ్వు, వరి, మామిడితోటల వద్దకు వెళ్లి నష్టంపై ఆరా తీశారు. అకాల వర్షంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టం అంచనాలు తయారు చేసి తనకు నివేదిక అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ నివేదికను వ్యవసాయ మంత్రి, సీఎం దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు పరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మండల వ్యవసాయ అధికారి నాగమణి, సర్పంచులు సింగిల్‌విండో చైర్మన్ జగన్మోహనరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రంగి (వేములవాడ): మండలకేంద్రానికి చెందిన కుర్మ మల్లేశం గతనెలలో మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇక్కడ నాయకులు, కుర్మ కుల సంఘం సభ్యులు, తదితరులున్నారు.

పరిశ్రమ ఆపకుంటే ఉద్యమం ఉధృతం

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్
- ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజల ప్రాణాలు హరించే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని రద్దు చేయకుంటే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ఆ పార్టీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ అన్నారు. స్తంభంపల్లి గ్రామ శివారులో చేపట్టిన ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమకు వ్యతిరేకంగా 24 రోజులుగా పోరు కొనసాగిస్తున్న పాశిగామ గ్రామస్తులను ఆయన ఆదివారం కలుసుకుని సంఘీభావం తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణంతో ఎదురయ్యే నష్టాలను గురించి గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో దొంగతనాలు జరుగుతున్నాయని, వీటిని నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేని పోలీసులు.. కార్పొరేట్ కంపెనీ కోసం అడగకముందే సీసీ కెమెరాలు ఏర్పాటు చాశారని విజయ్‌కుమార్ ఆరోరపించారు. సీసీ కెమెరాలతో పొలం పనులు చేసుకునే మహిళలు.. మల, మూత్ర విసర్జనకు వెళ్తే వాటిలో రికార్డు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని పరిశీలించడానికి వెళ్లిన విజయ్ కుమార్‌ను.. అనుమతి లేకుండా వెళ్లకూడదని ఎస్సై నరేశ్‌కుమార్ అడ్డుకున్నారు. క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరికి పోలీసులు అనుమతించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రధాని కావాలనే ఆశతో సీఎం కేసీఆర్ కమీషన్లకు ఆశపడి కార్పొరేట్ కంపనీలకు కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ప్రాణాలు తీసే పరిశ్రమలను జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్నాడని ఆరోపించారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నా.. స్పందించడం లేదంటే.. వారి ప్రాణాల కంటే ఫ్యాక్టరీ నిర్మాణమే ముఖ్యమా? అని ప్రశ్నించారు. ప్రజల కోసం ఎన్నుకున్న ప్రభుత్వం.. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించడం ఏమిటని నిలదీశారు. పలువురు గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం



గ్రామస్తులతో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు

కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలు ఈటల నిరూపించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల రూరల్ : కాంగ్రెస్‌ను ఎదగనీయకుండా కేంద్రంలోని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జగిత్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలను నిరూపించాలన్నారు. మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారని, బీజేపీ ఎమ్మెల్యే అనడం తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం మిగులు బడ్జెట్ నుంచి అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందన్నారు. 2020–21 వరకు బీఆర్‌ఎస్, బీజేపీ మిత్రపక్షంగా ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబం ఎలా ఎదిగిందని, మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రూ.60 కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసిన రాష్ట్రంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కండ్లపల్లి దుర్గయ్య, నాయకులు కమటాల శ్రీనివాస్, పుప్పాల ఆశోక్, రాధాకిషన్, గుండ మధు, నేహాన్, మహిపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకే బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి

మల్లాపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్నందుకే కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుట్రలు పన్నుతున్నాయని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని ముత్యంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఎజెండాలో భాగంగానే మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా సీఎం కేసీఆర్ కాంగ్రెస్ పార్టీకి రూ.25కోట్లు ఇచ్చారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారని విమర్శించారు. ఈటల ఆత్మసాక్షిగా ప్రమాణం చేసి ఆరోపణలను రుజువు చేయాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాకిటి సత్యంరెడ్డి

మల్యాలలో భారీ అగ్నిప్రమాదం

- దుస్తుల దుకాణంలో చెలరేగిన మంటలు
- సుమారు రూ. 20లక్షలకుపైగా ఆస్తి నష్టం
- మంటలనార్పిన అగ్నిమాపక సిబ్బంది
- తప్పిన పెను ముప్పు..

మల్యాల (చొప్పదండి) : మండల కేంద్రంలోని దుస్తుల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.20 లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని అంగడి బజారులోని నటరాజ్ డ్రెస్సెస్ దుకాణంలో వెంటిలెటర్ల నుంచి పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. అదే భవనంలో పై అంతస్తులో ఉంటున్న దుకాణం యజమానికి సమాచారం ఇవ్వగా వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కిందికి పరుగులు తీశారు. మరో ముగ్గురిని స్థానిక యువకులు కిందికి తీసుకువచ్చారు. దుకాణంలోని దుస్తులు మంటల్లో కాలిపోయాయి. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించారు.

స్థానికుల ఆగ్రహం..

అగ్ని ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఆలస్యంగా వచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నూకపల్లిలోని వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు ఓపెన్ చేయగా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక యంత్రం అక్కడే ఉంది. దీంతో జిల్లా అధికారుల అనుమతి తీసుకుని రాగా, సమాచారం ఇచ్చిన తర్వాత సుమారు గంట తర్వాత వచ్చిందని, సకాలంలో అగ్నిమాపక యంత్రం వచ్చి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేది కాదని దుకాణం యజమాని మోహన్ వాపోయాడు. అగ్నిమాపక సిబ్బంది సుమారు 3 గంటల పాటు కష్టపడి మంటలను పూర్తి ఆర్పివేశారు.



దుకాణంలో చెలరేగిన మంటలు

తప్పిన ముప్పు..

దుస్తుల దుకాణంలో మంటలు చెలరేగడంతో విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై వెంటనే విద్యుత్‌ను నిలిపివేశారు. దుకాణానికి ఓ వైపు ముత్తుట్ ఫైనాన్స్, మరోవైపు కేడీసీసీ బ్యాంకు ఉంది. రెండో అంతస్తు వరకు మంటలు వ్యాపించాయి. ఫైర్ ఆఫీసర్ సీహెచ్.మారుతి, సిబ్బంది మల్లేశం,ప్రశాంత్, దత్తురాం సింగ్ సుమారు మూడు గంటలపాటు శ్రమించి, మంటలనార్పివేశారు. ఫైరింజన్‌తో మంటలు అదుపులోకి రాకవడంతో సర్పంచ్ సుదర్శన్ నాలుగు వాటర్ ట్యాంకర్లు తెప్పించగా జనరేటర్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దుస్తుల దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నామని కుటుంబీకులు కంటతడి పెట్టుకున్నారు. ఇంట్లో శుభకార్యం ఉండడం వల్ల అదే సమయంలో మంటలంటుకోగా తాము గమనించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, జెడ్పీటీసీ కొండపల్కల రాం మోహన్‌రావు, మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్, మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు నేరెళ్ల రాజేశ్వర్‌రెడ్డి దుకాణం యజమాని మోహన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.


బావిలో పడి వృద్ధుడి మృతి

వెల్గటూర్ : బావిలో పడి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని కిషన్‌రావుపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుషనపల్లి రాజయ్య (65) నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ఆదివారం బావిలో కుళ్లిన మృతదేహం లభ్యమైంది. నాలుగు రోజుల క్రితం గ్రామంలో చిరుతల రామాయణం నాటకం చూసేందుకు వచ్చి రాత్రిపూట రోడ్డుపక్కన ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నరేశ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకూతురు అదృశ్యం

జగిత్యాల క్రైం : జగిత్యాల రూరల్ మండలం.. గుల్లపేట గ్రామానికి చెందిన ఆడెపు మానస ఆమె కూతురు అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన ఆడెపు మానస కొన్ని సంవత్సరాలుగా భర్తతో మనస్పర్థలు రావడంతో తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈనెల 21న ఉదయం తన కూతురు వేదాన్షిని తీసుకొని వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లు, తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మానస తల్లి గుజ్జెటి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.


రైతులకు నష్ట పరిహారం అందించాలి



పైడిమడుగులో జామతోటను పరిశీలిస్తున్న గోపాల్ రెడ్డి

కోరుట్ల రూరల్ : మండలంలో వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో దెబ్బతిన్న వరి, నువ్వు, మామిడి, జామ తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ భీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ఉంటే పరిస్థితి వచ్చేది కాదన్నారు. ముత్యంపేట చెక్కర ఫ్యాక్టరీ ప్రారంభిస్తే ఎంతో మంది రైతులు చెరుకు పంటవైపు మొగ్గు చూపేవారని, ప్రకృతి వైపరీత్యాలకు చెరుకు తట్టుకునే అవకాశం ఉండేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంట నష్టాన్ని తొందరగా అంచనా వేసి రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అయిలాపూర్ చెరువులో చేపలు చనిపోయాయని గంగ పుత్రులకు నష్ట పరిహారం అందించాలని పేర్కొన్నారు. బీజేపీ కోరుట్ల ఇన్‌చార్జి యాదగిరి బాబు, మండల బీజేపీ అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్, యూసుఫ్‌నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, నాయకులు గణేశ్, కిషన్, రాజేందర్, లింబాద్రి, వెంకట్‌రెడ్డి, శ్రీపతి రెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెగడపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లె పల్లెకు సీపీఐ–ప్రజల వద్దకు సీపీఐ ప్రజా చైతన్య యాత్ర ఆదివారం రాత్రి పెగడపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రం విధానాలను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, ఐటీ, సీబీఐ తదితర కేంద్ర సంస్థలను ప్రయోగిస్తూ జైళ్లపాలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను మరిచి మోసం చేశారన్నారు. 55 ఏళ్లున్న వారికి ఆసరా ఫించన్ల, కొత్త రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విభజన హామీలను అమలు చేయాలని బీజేపీ హటావో–దేశ్‌కీ బచావో అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టి ప్రజలను చైతన్యవంతులుగా చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, మంద పవన్, వెన్న సురేశ్, ముత్రమ్, జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, ప్రవీణ్, సురేశ్, శేఖర్, చంద్రయ్య, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.